క్లుప్తంగా

14న మహనీయుల పేరిట పురస్కారాల ప్రదానం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

సీటీఆర్‌ఐ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 14న పలువురు ప్రముఖులకు మహనీయుల పేరిట పురస్కారాలు అందజేస్తున్నట్లు రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు అన్నారు. మంగళవారం పూలే విగ్రహం వద్ద ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సంఘం నాయకులతో కలసి ఆవిష్కరించారు. ముందుగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 14వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఆనం రోటరీ హాలులో జరిగే సభలో పురస్కారాల ప్రదానోత్సవం జరుగుతుందన్నారు. పూలే, అంబేడ్కర్ సేవా పురస్కారాన్ని కేకే సంజీవరావుకు, పూలే అవార్డును గుత్తుల సుబ్రహ్మణ్యానికి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అవార్డును కొంకి రమేష్‌కు, బాబూ జగ్జీవన్‌రామ్ అవార్డును వైరాల అప్పారావుకు, సర్దార్ గౌతు లచ్చన్న పురస్కారాన్ని అసదుల్లా అహ్మద్‌కు, బత్తిన సుబ్బారావు అవార్డును కె.లాజరుకు అందజేస్తామని తెలిపారు.

పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం



ప్రశాంత్ కుమార్ హాలోనెన్‌ను సత్కరిస్తున్న ఫెలోషిప్ సభ్యులు

కడియం: మండల పాస్టర్స్ ఫెలోషిప్, క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. మురమండలోని ఫెలోషిప్ గౌరవాధ్యక్షుడు, రాజమహేంద్రవరం రీజినల్ జాయింట్ సెక్రటరీ కె.జయశీల్‌కు చెందిన పెనూయేలు ప్రార్థనా మందిరంలో ఈ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన రెవరెండ్ ప్రశాంత్‌కుమార్ హాలోనెన్ వాక్యసందేశాన్నిచ్చారు. సంఘ సభ్యులు ఆయన్ను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఫెలోషిప్ నాయకులు ఎం.కరుణాకర్, డి.పరంజ్యోతి, సీహెచ్ రత్నదీప్, బిషప్ రెయిన్ హార్ట్, బిషప్ సోలోమెన్ పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి



చెక్కు అందజేస్తున్న అల్లు బాబీ

రాజమహేంద్రవరం సిటీ: ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తోందని ది గోదావరి ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ రిలేటెడ్ వెల్ఫేర్ అసోసియేన్ గౌరవ అధ్యక్షుడు అల్లు బాబీ అన్నారు. రాజమహేంద్రవరం జోన్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్మంచర హాల్లో అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఇటీవల ప్రమాదవశాత్తు నగరానికి చెందిన అసోసియేషన్ సభ్యుడు చల్లా లక్ష్మణరావు మృతి చెందడంతో ఆయన భార్య తనూజాదేవికి రూ.5 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మయూరి శివ, సెక్రటరీ శేఖర్, ట్రెజరర్ ఆశా రాంబాబు పాల్గొన్నారు.

14 నుంచి ప్రచార భేరి

ప్రకాశం నగర్: బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో కేంద్ర కమిటీల పిలుపు మేరకు ఏప్రిల్ 14 నుంచి 30 వరకు ప్రచార భేరి నిర్వహిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వి.ఉమామహేశ్వర రావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక శ్యామల సెంటర్లో ప్రచార భేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉమామహేశ్వర రావు, జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సీపీఐ జిల్లా కార్యదర్శి టి.మధు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల, ప్రైవేటీకరణ విధానాలు అనుసరిస్తోందన్నారు.

తడి, పొడిచెత్తపై అవగాహన అవసరం

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి ఇంటి యజమాని తడి, పొడి, హానికర చెత్తపై అవగాహన కలిగి ఉండాలని రాజమహేంద్రవరం నగరపాలకసంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ అన్నారు. మంగళవారం ఉదయం స్థానిక 10వ డివిజన్ మోరంపూడి సాయిచైతన్య నగర్‌లో డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జి ఎండీ రషీదా నేతృత్వంలో ప్రజా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ముఖ్యఅతిథిగా హాజరైన కమిషనర్ ప్రారంభించారు. అనంతరం ఇళ్ల నుంచి చెత్తను సేకరిస్తున్న విధానాన్ని పరిశీలించారు. యూజర్ చార్జీలు సక్రమంగా చెల్లించడం, రోడ్లు పరిశుభ్రంగా ఉండడం తదితర విషయాలను గమనించి అక్కడ స్థానికులను, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రషీదాను, శానిటరీ సెక్రటరీలను, వార్డు వలంటీర్లను అభినందించారు. 10వ డివిజన్‌లో జరుగుతున్న విధానాలను అన్ని క్లస్టర్లలో అమలు పరిచేలా చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖాధికారిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ ఏ.వినూత్న, శానిటరీ సూపర్‌వైజర్ ఇంద్రగంటి శ్రీనివాస్, జె.జార్జి సుధీర్, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి ఆరే చిన్ని పాల్గొన్నారు.

పూలే జీవితం.. అందరికీ ఆదర్శం

- కొనియాడిన వక్తలు
- ఘనంగా జ్యోతిరావు జయంత్యుత్సవం



ఎంపీ కార్యాలయంలో వేడుకల్లో పాల్గొన్న మార్గాని నాగేశ్వరరావు, శ్రీహరి



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చందన నాగేశ్వర్ తదితరులు



కలెక్టరేట్‌లో జయంతి వేడుకలు నిర్వహిస్తున్న జేసీ తేజ్‌భరత్



పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న రుడా చైర్ పర్సన్ షర్మిలారెడ్డి

సీటీఆర్‌ఐ: మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం అందరికీ ఆదర్శప్రాయమని వక్తలు కొనియాడారు. ఆయన జయంత్యుత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రుడా కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్, రుడా సెక్రటరీ జి.శైలజవల్లి, రుడా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి.శ్రావణ్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమ్‌ఆద్మీ పార్టీ నగర కన్వీనర్ అత్తిలి రాజు ఆధ్వర్యంలో ఏవీ అప్పారావు రోడ్డులోని పూలే కాంస్య విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. గాంధీపురంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, పీసీసీ సభ్యుడు బాలేపల్లి మురళీధర్ ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు.

కలెక్టరేట్‌లో..

మహిళల విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేసిన జ్యోతిరావు పూలే దంపతులు చేసిన సేవలు చిరస్మరణీయమని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ అన్నారు. కలెక్టరేట్‌లో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఆర్వో జి.నరసింహులు, ఏవో జి.భీమారావు తదితరులు పాల్గొన్నారు.

బలహీనవర్గాల ఆశాజ్యోతి

రాజమహేంద్రవరం రూరల్: బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే అని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీగ్రీనింగ్ అండ్‌బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ కొనియాడారు. మంగళవారం వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో పూలే జయంతి నిర్వహించారు. చందన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. మాజీ ఎంపీపీ రేలంగి వీర వెంకట సత్యనారాయణ, దేవాంగుల కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, హుకుంపేట సొసైటీ చైర్‌పర్సన్ బొప్పన సుబ్బారావు, పార్టీ నాయకులు పసలపూడి శ్రీనివాస్, పెయ్యల రాజేష్, పడాల రాఘవ రెడ్డి, చీరా రాజు, బీదం రాజు, బత్తిన అప్పారావు పాల్గొన్నారు. హుకుంపేటలోని కరుటూరి శ్రీనివాసరావు నివాసంలో మండల బీజేపీ ఆధ్వర్యంలో పూలే జయంతి జరిగింది. అసెంబ్లీ కో కన్వీనర్ యానాపు ఏసు, పార్టీ నాయకులు.. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బొమ్మూరులో టీడీపీ మండల అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

పూలే, అంబేడ్కర్ ఆశయాల సాధన

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పూలే, అంబేడ్కర్ ఆశయాలను అనుగుణంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు అన్నారు. వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో మంగళవారం జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, బీసీ సెల్ అధ్యక్షుడు మజ్జి అప్పారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పార్టీ నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, ఆర్యాపురం కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ మజ్జి నూకరత్నం, ఎస్వీ శ్రీనివాస్, దుంగా మంగ, అందనాపల్లి సత్యనారాయణ, రేలంగి వీర వెంకట సత్యనారాయణ, సాలి వేణు, వి.రామకృష్ణ, నెల్లి సర్వేశ్వరరావు పాల్గొన్నారు. స్థానిక దేవీచౌక్ సెంటర్ సమీపంలోని జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ ఎస్‌టీజీ గోవిందు ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు. పశువైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్ చంద్ర, కార్యాలయ పర్యవేక్షకులు భాస్కర కుమార్ పాల్గొన్నారు.

మహాత్మునికి పుష్పాంజలి

కడియం: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. జేగురుపాడులో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆకుల సుధాకర్, పార్టీ నాయకులు పుట్టా బుజ్జి, మారిశెట్టి నాగన్న, బుడ్డిగ గణపతి, మాన్యం సూర్యారావు, పేపకాయల సత్యనారాయణ పాల్గొన్నారు. కడియం మండల యూటీఎఫ్ ఆధ్వర్యంలో వేమగిరి బుద్ధవిహారాలో పూలే జయంతి నిర్వహించారు.

ముందుకు కదలని మురుగు



ఐఓసీ కాలనీ శివారులో నిలిచిన మురుగు



ఐఓసీ కాలనీలో పెరిగిన తుప్పలు

- ఐఓసీ వాంబే కాలనీలో అవుట్‌లెట్ లేక అవస్థలు
- ఏళ్ల తరబడి తీరని సమస్య

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మురుగునీరు పోయేందుకు అవుట్‌లెట్ లేకపోవడంతో ఏళ్ల తరబడి ఆ ప్రాంత వాసులు ఇక్కట్లు పడుతున్నారు. ఒక పక్క డ్రైనేజీలో మురుగునీరు వెళ్లక, మరో వైపు సెప్టిక్ ట్యాంకులు నిండి బయటకు రావడంతో దోమలు విపరీతంగా పెరిగిపోయి, కంటి మీద కునుకు లేకుండా ఆవేదన చెందుతున్నారు. వీధిలైట్ల నుంచి పూర్తిస్థాయిలో వెలుగు రాకపోవడంతో రాత్రి సమయాల్లో ఇంటికి వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి సమస్యతో సతమతమవుతున్నారు. నగరపాలకసంస్థ పరిధి 17వ డివిజన్‌లోని ఐఓసీ కాలనీ వాసుల ఇబ్బందులు ఇవీ.

వైఎస్సార్ హయాంలో..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఇక్కడ పేద ప్రజల కోసం వాంబే కాలనీకి శంకుస్థాపన చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టారు. 2013లో అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి చేతుల మీదుగా ఐఓసీ కాలనీకి ప్రారంభోత్సవం జరిగింది. కాలనీలో 18 బ్లాకుల్లో బ్లాక్‌కు 32 చొప్పున 540 ఫ్లాట్లలో పేద, మధ్యతరగతి ప్రజలు జీవిస్తున్నారు. అయితే వాంబే కాలనీ నిర్మాణ సమయంలోనే డ్రైనేజీ అవుట్‌లెట్ లేకపోవడంతో అప్పటి నుంచి సమస్య తలెత్తుతోంది. ఈ విషయాన్ని స్థానిక ప్రజలు నగరపాలకసంస్థ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ పూర్తిస్థాయిలో పరిష్కారానికి నోచుకోలేదు. ఇటీవల వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చినప్పుడు స్థానిక ప్రజలు డ్రైనేజీ సమస్యను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన వెంటనే నగరపాలకసంస్థ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని సూచించారు. దీంతో నగరపాలకసంస్థ కమిషనర్ దినేష్‌కుమార్ డ్రైనేజీ అవుట్‌లెట్‌కు శాశ్వత ప్రణాళికలు సిద్ధం చేయాలని సూపరింటెండెంట్ ఇంజనీర్‌కు ఆదేశాలు సైతం జారీ చేశారు.

స్థానికుల అవస్థలు

ఐఓసీ కాలనీలో మురుగునీరు బయటకు వెళ్లకపోవడంతో శివారున పేరుకుపోయింది. అంతేకాకుండా సెప్టిక్ ట్యాంకులు నిండిపోయి వ్యర్థాలు డ్రైనేజీలో కలవడంతో దుర్వాసన వెలువడుతోంది. దోమలు విపరీతంగా పెరిగిపోయి కాలనీవాసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కాలనీలో వీధిలైట్లు ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో వెలుగులు ఉండడం లేదు. పనులకు పోయి రాత్రి సమయంలో ఇళ్లకు రావాలంటే భయపడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి



ఐఓసీ కాలనీలో డ్రైనేజీ అవుట్‌లెట్ లేకపోవడంతో ఏళ్ల తరబడి చాలా ఇబ్బందులు పడుతున్నాం. మురుగు ముందుకు వెళ్లకపోవడంతో దోమలు విపరీతంగా పెరిగిపోయి అనారోగ్యం పాలవుతున్నాం. పూర్తిస్థాయిలో వీధిలైట్లు వేయాలి. తాగునీటి సమస్యను పరిష్కరించాలి.

– జువ్వాల నాగిరెడ్డి, ఐఓసీకాలనీ

శాశ్వత పరిష్కారం



ఐఓసీ కాలనీ డ్రైనేజీ అవుట్‌లెట్ సమస్యకు త్వరితగతిన శాశ్వత పరిష్కారం చేపడతాం. ఇటీవల నగరపాలకసంస్థ కమిషనర్ దృష్టికి ఈ సమస్య రావడంతో సూపరింటెండెంట్ ఇంజినీర్‌ను డ్రైనేజీ అవుట్‌లెట్ శాశ్వత పరిష్కారానికి ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. త్వరలోనే కార్యరూపం దాల్చనుంది.

– ఇంద్రగంటి శ్రీనివాస్, శానిటరీ సూపర్‌వైజర్, నగరపాలకసంస్థ

జగన్ పాలనకు అందరి మద్దతు

- ప్రతినోటా 'జగనన్నే మా భవిష్యత్తు'
- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్



20వ డివిజన్‌లో ప్రజల అభిప్రాయం నమోదు చేసుకుంటున్న చందన నాగేశ్వర్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు అన్నివర్గాల మద్దతు లభిస్తోందని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీగ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి వస్తున్న ఆదరణే అందుకు నిదర్శనమన్నారు. మంగళవారం రూరల్ నియోజకవర్గం పరిధిలోని నగరపాలకసంస్థకు చెందిన 28, 20వ డివిజన్లలో జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికుల అభిప్రాయాలను సేకరించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పనితీరును తెలుసుకున్నారు. తమ ప్రభుత్వం కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా పరిపాలన సాగిస్తోందని తెలిపారు. సీఎం జగన్ పాలనతో లబ్ధిపొందిన వారు తమ ఇంటికి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించుకున్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి మింది నాగేంద్ర, రాష్ట్ర ఖాదీబోర్డు వైస్ చైర్మన్ పిల్లి నిర్మల, ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బిల్డర్ చిన్న, జేసీఎస్ కన్వీనర్ కాప్పినీడి ప్రసాద్ బాబు, పెయ్యల రాజేష్, అంగాడి సత్యప్రియ, చీకురుమిల్లి చిన్న, దుంపాచంద్రారెడ్డి, మేడపాటి కృష్ణారెడ్డి, కామరాజు, కాపుభాను, నాగమణి, బూర కనకలింగేశ్వరారావు, గౌరీ శంకర్, దుర్గా మహేష్, భాస్కరరావు, సత్తిరాజు, క్రాంతి కుమారి పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో కొత్త తుంగపాడు

- నాలుగేళ్లలో రూ.3.74 కోట్లతో అభివృద్ధి పనులు
- గడపగడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజా



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: మండలంలోని కొత్త తుంగపాడులో రూ.3.74 కోట్లతో గడచిన నాలుగేళ్లలో అభివృద్ధి పనులు చేపట్టామని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఆ గ్రామంలో మంగళవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు ఏ మేరకు ప్రయోజనం చేకూరిందో కరపత్రాల ద్వారా వివరించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఈ గ్రామంలో కేవలం రూ.22.67 లక్షలతోనే అభివృద్ధి పనులు జరిగాయన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందిస్తోందన్నారు. ప్రతి ఏటా ఈ గ్రామంలో 1301 మందికి రూ.7,66,87,060 వరకు ఆర్థిక ప్రయోజనం లభిస్తోందన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా రూ.48 లక్షలు వెచ్చించి, ఇంటింటికీ తాగునీటిని అందించేలా ఓహెచ్ఆర్ నిర్మిస్తున్నామన్నారు. నాడు – నేడు పథకం ద్వారా రూ.17 లక్షలతో పాఠశాలలను అభివృద్ధి చేశామన్నారు. రజకుల కోసం రూ.12 లక్షలతో కమ్యూనిటీ హాలు నిర్మిస్తున్నామన్నారు. 14వ ఆర్థిక సంఘం నిధులతో రోడ్లు, డ్రైన్లు ఏర్పాటు చేశామని, అర్హులైన వారందరికీ నివాస స్థలాలు అందించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కాగా.. కొబ్బరి చెట్టు పైనుండి పడిపోవడంతో వెన్నెముక దెబ్బతిని కదలలేని స్థితిలో ఉన్న గొల్లపల్లి వెంకన్నను పరామర్శించి, సామాజిక పింఛను అందించేలా చర్యలు తీసుకున్నారు. సీనియర్ నాయకుడు ఉద్దండి వీర్రాజు ఇంటికి వెళ్లి ఆరోగ్యపరిస్థితిని తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, సర్పంచ్ కోలపాటి వెంకన్న, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మీపతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, కోకన్వీనర్ గండి నానిబాబు, కైదాసి వీర్రాజు, మద్దిలి ఏసు, ఎడ్ల నాగేశ్వర్రావు, బత్తుల చిన్నారావు, బైరిశెట్టి రాధాకృష్ణ పాల్గొన్నారు.